క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు మహారాష్ట్రలోని శివాజీ మహరాజ్ స్టేడియంలో ఈనెల 3 నుంచి 5 వరకు జరిగిన సాఫ్ట్ బేస్‌బాల్ నేషనల్ క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థులు పెద్ది దీక్షిత, బట్టు వేద, వంశిక, బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు వంగపల్లి భానుతేజ, సమీర్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో రజత పతకం, బాలుర విభాగంలో బ్రాంజ్ పతకాలను సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్పీ భాస్కర్ గురువారం పోలీసు ప్రధాన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సచిన్, ఆర్ఐ రాజుసాగర్, కోఆర్డినేటర్ శివకోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో సీసీరోడ్డు పనులను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి గురువారం ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం నిధులు రూ.70లక్షలతో గ్రామంలోని పలు వాడల్లో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం పోతారం గ్రామంలో ఎమ్మెల్యే నిధులు రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, మార్కెట్ డైరెక్టర్లు తీట్ల శంకర్, ఏఙీబీ మహేందర్, సర్పంచులు కూన సులోచన, గజ్జెల స్వామి, ధర్మపురి జలందర్, నాయకులు బద్దం మహేందర్, ముస్కు శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సర్సారెడ్డి పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి పెళ్లికి సాయం



పుస్తెమెట్టెలు అందజేస్తున్న సభ్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన బండారి రాధ కూతురు రాజశ్రీ వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయం అందించారు. ఈ మేరకు గురువారం వారికి పుస్తెమెట్టెలు, పట్టుచీర, 200 మందికి సరిపడా భోజన సామగ్రి ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ నేరేళ్ల హేమలత, ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు నరేశ్, రాంప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై సమావేశం

కోరుట్ల: పట్టణంలోని మూడో వార్డులోని సమస్యలపై ఆ వార్డు కమిటీ సభ్యులు కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డులో ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు సరి చేయాలని, 57 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలని, హిందువుల శ్మశాన వాటిక, ముస్లింల కబరస్తాన్‌లకు స్థలం కేటాయించాలని తీర్మానించారు. తీర్మాన ప్రతులను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్యకు అందజేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వార్డు కమిటీ సభ్యులు సుదర్శన్, చిలుక మహేశ్, రిహాన పాల్గొన్నారు.

ఆర్థికచేయూత



మల్యాల: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం జలపతిరెడ్డి ఇటీవల ఇద్దరు కూతుళ్లతోపాటు బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్న విషయం విదితమే. కాగా మృతుడి భార్య, పెద్ద కూతురిని గురువారం మండలకేంద్రానికి చెందిన నల్లపు మల్లేశం నర్సింగాపూర్ వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు అందించారు. సంపత్ పటేల్, ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.

నర్సరీ పనులు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో నర్సరీలో చేపడుతున్న పనులను ఎంపీడీవో ప్రభు గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో శానిటేషన్ పనులను, క్రీడా ప్రాంగణ పనులు పరిశీలించారు. కార్యదర్శి రాజశేఖర్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేవు.. అడిగెటోళ్లు లేరు

- ఫిర్యాదు చేసినా చర్యల్లేవ్
- అక్రమంగా మట్టి సరఫరా
- కనుమరుగవుతున్న ప్రకృతి సంపద
- పట్టించుకోని అధికారులు



జేసీబీతో గుట్టను తవ్వుతున్న దృశ్యం

వెల్గటూర్: మండలంలో అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కుల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికార పార్టీ పెద్దల అండదండలతో అక్రమార్కులు ప్రకృతి సంపద కొల్లగొడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టపగలు జేసీబీలు, ట్రాక్టర్లతో గుట్టలు తవ్వేసి మట్టిని తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇంత పెద్ద మొత్తంలో అక్రమ వ్యాపారం సాగుతున్నా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

నూతన నిర్మాణాల కోసం మట్టికి డిమాండ్

ఎండపల్లి మండల కేంద్రంలోని జొన్నలరాశి గుట్ట, పాతగూడూర్‌లోని దస్తగిరి గుట్ట, ఎండపల్లి-గుల్లకోట గ్రామ శివారుల్లోని మిట్టతాళ్ల గుట్టలను ఇష్టానుసారం తవ్వేసి గుట్టలను కనుమరుగు చేస్తున్నారు. ఎండపల్లి మండల కేంద్రంలో ఇద్దరు, గుల్లకోట శివారుల్లో చెర్లపల్లి గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో కొన్నేళ్లుగా నిత్యం ఈ మట్టి సరఫరా సాగుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. కాగా గురువారం కూడా ఉదయం నుంచే దర్జాగా జేసీబీ సాతో తవ్వి ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షల్లో వ్యాపారం..

ఎండపల్లికి సమీపంలోని ధర్మారం మండల కేంద్రంలో నూతన నిర్మాణాలకు, నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండల కేంద్రంలో నూతన వ్యాపార సముదాయాల నిర్మాణాలకు, పరిసర గ్రామాల్లో నూతన నిర్మాణాలకు ఇక్కడి నుంచే మట్టి సరఫరా చేస్తున్నారు. పెట్టుబడి లేకుండా రూ.లక్షల్లో లాభం వచ్చే వ్యాపారం, పైగా నష్టం లేని వ్యాపారం కావడంతో రాజకీయ అండదండలు ఉన్న స్థానిక నేతలు మట్టి అక్రమ సరఫరా చేస్తున్నారని స్థానికంగా ఆరోపణలు వినవస్తున్నాయి.

పట్టించుకోని అధికార యంత్రాంగం..

గుల్లకోట-ఎండపల్లి గ్రామాల శివారులోని గుట్ట నుంచి గుల్లకోటలోని నూతన గృహనిర్మాణానికి గురువారం పట్టపగలు దర్జాగా మట్టి తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు మండల తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా మధ్యాహ్నం వరకు స్పందించలేదు. మధ్యాహ్నం 12గంటల తర్వాత నాయబ్ తహసీల్దార్‌ను ఎంక్వైరీకి పంపి అసైన్‌మెంట్ భూమిలో మట్టి తీస్తున్నారు కాబట్టి ఎటువంటి చర్యలు తీసుకోలేమని తహసీల్దార్ నిర్లక్ష్యంగా బదులిచ్చారు.

మట్టి తరలింపు నియమ నిబంధనలు

నూతన గృహ నిర్మాణాలకు గానీ ఏదేని అవసరాలకు గానీ మట్టిని తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి తప్పనిసరి. ముందుగా రెవెన్యూశాఖ అనుమతి తీసుకొని తర్వాత మైనింగ్ శాఖకు నిర్ణీత పన్ను చెల్లించి అనంతరం మట్టి తవ్వకాలు చేపట్టాలి. పట్టా భూమిలో మట్టి తీయాలన్నా ఈ రెండు శాఖల అనుమతి తప్పనిసరి. కానీ ఎండపల్లి మండలంలో ఈ నిబంధనలకు తిలోదకాలిచ్చిన అక్రమార్కులు ఇష్టానుసారం మట్టిని తవ్వేస్తున్నారు. వ్యవసాయేతర పనులకు వినియోగించే ట్రాక్టర్లను కమర్షియల్ రిజిస్ట్రేషన్ ఉన్న వాటినే ఉపయోగించాలి. కానీ టాక్సులు తప్పించుకునేందుకు అగ్రికల్చర్ రిజిస్ట్రేషన్ చేయించి మట్టి తరలింపునకు వినియోగిస్తున్నారు. రాజకీయ నేతలు, అధికారుల అండదండలతోనే ఇంత పెద్ద మొత్తంలో అక్రమ వ్యాపారం సాగుతోందని, అందుకే వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి తరలిస్తున్నారనే సమాచారం వచ్చింది



గుల్లకోట శివారులోని గుట్ట ప్రాంతంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మా నాయబ్ తహసీల్దార్ వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం వారికి కేటాయించిన భూమిలో మట్టి తీసుకుంటున్నందున ఎటువంటి చర్యలు తీసుకోలేం.

– ఉదయ్‌కుమార్, తహసీల్దార్, ఎండపల్లి

రైతులు కెపాసిటర్లను బిగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఈ హరీశ్

రాయికల్: రైతులు తప్పనిసరిగా మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ఏడీఈ హరీశ్ కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఒడ్డెలింగాపూర్, చింతలూరు గ్రామాల్లో రైతులకు కెపాసిటర్లు బిగించుకోవడంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కెపాసిటర్లు బిగించుకోవడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గుతుందని, లోవోల్టేజీ సమస్య తగ్గుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ



అభినందిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల చైతన్య ఈటెక్నో స్కూల్ విద్యార్థులు అపముద్దీన్ డిసెంబర్‌లో జరిగిన జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్‌లో మంచి మార్కులు సాధించి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ యాస్మిన్‌బాషా విద్యార్థికి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ సచిన్ ఉన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో గురువారం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలతో పాటు స్వామి కల్యాణం, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు-చంద్రిక దంపతులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ వనతడుపుల నాగరాజు, ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, ఉపసర్పంచ్ సామ రవి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎర్రంశెట్టి రాజగంగారాం, నాయకులు ఓస రాజరెడ్డి, తిప్పని సాయికృష్ణ, గంధం రాజేశం, గోల్కొండ లింగారెడ్డి, ఓస చిన్నలింగన్న, దామెర గంగాధర్, చిట్యాల నడ్పినర్సయ్య, చెట్లపెల్లి రమేశ్ గౌడ్, చెల్లపెల్లి గంగరాం, మాసుల చిన్నయ్య, ఎనడ్ల రాములు, వరద సురేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ‘ప్రైవేట్’ ప్రచారం



ప్రచారం చేస్తున్న సుధీర్

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని కోరుతూ గురువారం పీఆర్వో సుధీర్ ప్రచారం చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు అల్లీపూర్‌కు చెందిన రమేశ్ గురువారం తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

కొడిమ్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టేందుకే హాత్‌సే హాత్ జోడో అభియాన్ అని యూత్ కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ అన్నారు. కొడిమ్యాల్ మండల కేంద్రంలో గురువారం హాత్ సే హాత్ కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు వినోద్‌నాయక్, చంద్రమోహన్, అంజయ్య, తిరుపతి, మల్లేశ్‌నాయక్, సత్యం, చందు, మాణిక్యం, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఒగ్గు కళాకారుల నృత్యాలు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో పోచమ్మ బోనాల పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీమల్లిఖార్జునస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా మొదటగా పోచమ్మకు బోనాల సమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల్లో సర్పంచ్ భైర హేమలత, ఎంపీటీసీ బొడ్డు బాలు, నాయకులు, కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నల్లబ్యాడ్జీలతో నిరసన

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలు గురువారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అల్లకట్టు సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, అశోక్, విశ్వప్రసాద్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

✦ కంటివెలుగు రెండోవిడత ప్రారంభం

బుగ్గారం: మండలంలోని సిరికొండలో కంటివెలుగు రెండోవిడతను జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ గురువారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ జోగినపెల్లి సుచేందర్, ఎంపీడీవో తిరుపతి, సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ శ్రీలత, నాయకులు దాసరి లచ్చయ్య, హెచ్ఈవో రాజేషం పాల్గొన్నారు.

✦ ఫొటోగ్రాఫర్ల సంతాపం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన వంగరి నర్సయ్య (48) అనే సీనియర్ ఫొటోగ్రాఫర్ గుండెపోటుతో గురువారం మృతిచెందగా ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. దహన సంస్కారాల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందించినట్లు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

✦ అభివృద్ధి పనులు గుర్తించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఆయా గ్రామాల్లో 2023–24కి గాను బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద అభివృద్ధి పనులను గుర్తించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకటి, ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్ పాల్గొన్నారు.

✦ నర్సరీల పరిశీలన

రాయికల్: మండలంలోని తాట్లవాయి, కైరిగూడెం, కట్కాపూర్ గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు.

✦ సబ్సిడీ రుణాలకు సర్టిఫికెట్ల పరిశీలన

మల్లాపూర్: 2022–23 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకై దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారుల సర్టిఫికెట్లు పరిశీలించారు. గైర్హాజరైన లబ్ధిదారులు 10న ఎంపీడీవో కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

✦ సస్యరక్షణ చర్యలపై అవగాహన

మల్యాల: రైతులకు సస్యరక్షణలో మెలకువలపై గురువారం మండలంలోని తక్కళ్లపల్లిలో గురువారం గ్రామ పంచాయతీలో మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అవగాహన కల్పించారు.

✦ విద్యార్థులకు బహుమతి ప్రదానం

కోరుట్లటౌన్: నీట్ ఎగ్జామ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులకు మనోహరి హాస్పిటల్ వైద్యులు ముక్క ఇంద్రనీల్, గీతా ఇంద్రనీల్ బహుమతి ప్రదానం చేశారు.

✦ విద్యార్థికి సన్మానం

పెగడపల్లి: తల్లిదండ్రులు అప్పుడప్పుడు ఇస్తున్న డబ్బులను కిడ్డీ బ్యాంకులో పొదుపు చేసిన సొమ్మును ఆపద సమయంలో ఆర్థికసాయం చేస్తున్న విద్యార్థి సిద్ధార్థను గురువారం బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, పెగడపల్లి, నందగిరి సర్పంచులు శ్రీనివాస్, రాకేశ్, ల్యాగలమర్రి ఎంపీటీసీ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆపన్నహస్తం



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

వెల్గటూర్: మండలంలోని జగదేవుపేటకు చెందిన రేగుల బక్కన్న రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా గ్రామానికి చెందిన యువకులు ఆడెపు శ్రీధర్, అమరగోని సురేందర్ ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా వారి కుటుంబానికి సాయం అందించాలని కోరగా చాలామంది ముందుకు వచ్చారు. దీంతో దాతల ద్వారా సేకరించిన రూ.65వేలు గురువారం స్థానిక యువకులతో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు.

ఏఎస్ఎంల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జువ్వాజి కృష్ణారావు

మల్లాపూర్: న్యాయమైన డిమాండ్ల సాధనకు అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న రెండో ఏఎస్ఎంలను ప్రభుత్వం గృహ నిర్బంధాలతో అడ్డుకోవడం పాశవిక చర్య అని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ నాయకుడు జువ్వాజి కృష్ణారావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం మండలంలోని మొగిలిపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ ఎనడ్ల రాములు, నాయకులు గోల్కొండ రమేశ్, బోయినపెల్లి సత్యనారాయణరావు, తిరుమల గంగాధర్, రాజోజి సదానంద చారి, ఏలేటి రాజరెడ్డి పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వరి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ సెర్ప్ మహిళా సంఘాల సభ్యుల సహకారంతో ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవోలు రాజేశ్వరి, శైలజారాణి సూచించారు. ఈ మేరకు గురువారం మండల సెర్ప్ కార్యాలయంలో సెర్ప్ వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకుడుగుంతల నిర్మాణం వందశాతం పూర్తయ్యేలా సెర్ప్ మహిళా సంఘ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడుగుంత నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్త్రీనిధి రీజినల్ మేనేజర్ ఆనంద్ మాట్లాడుతూ స్త్రీనిధి రుణ సాయంతో సౌరవిద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళా సంఘ సభ్యుల నుంచి లోన్ రిక్వెస్ట్ పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్లు మల్లేశం, మానిక్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్, డీఎం దేవయ్య, సీసీలు రవీందర్, విద్యాసాగర్, సంతోష్, స్త్రీనిధి మేనేజర్లు మారుతి, రాణి పాల్గొన్నారు.

‘ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి’



పార్టీ సభ్యత్వ నమోదులో నాయకులు

కథలాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పాలిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం మండలంలోని గ్రామాల్లో సీపీఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఉన్నవారికే కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు, కర్షకులు సీపీఐలో చేరి పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు సుతారి రాములు, మండల నాయకులు ముత్యాల మురళి, చెన్నవేని దశరథం, కర్నె భూమయ్య, బొప్పరాతి జగన్, సోమ భూమయ్య, రాజం పాల్గొన్నారు.

16 నుంచి 19 వరకు శివరాత్రి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పెగడపల్లి: స్థానిక శ్రీస్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, సభ్యులు కోరారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను గురువారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 16న భూ కలశ గణపతి పూజ, పుణ్యాహవచనం, 17న సామూహిక నవగ్రహ హోమం, కుంకుమ పూజలు, 18న స్వామివారి కల్యాణం, బిల్వపత్రి సమర్పితం, లింగోద్భవ దర్శనం, 19న బలాదానం, పూర్ణాహుతి, రథోత్సవం, అన్నదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, పోచయ్య, అర్చకులు శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు



ఎల్లమ్మ జోగెత్తుటలో భక్తులు

కోరుట్లరూరల్: మండలంలోని సంగెం గ్రామంలో గల రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గురువారం రేణుకా ఎల్లమ్మకు జోగు ఎత్తుట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాగా శుక్రవారం పంట మహేశ్వరుడు, సురామాంబదేవి విగ్రహాలను ప్రతిష్ఠ, ఆదివారం భక్తులకు అన్నదానం, సోమవారం జాతర, రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని, మంగళవారంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు వివరించారు.

వాటర్‌ప్లాంట్ బహూకరణ



సురేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కొత్త సురేశ్-స్వరూప దంపతులు గురువారం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. ఈ మేరకు సురేశ్ దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు గడెల భూపతి, కొత్త సునీల్, సుధీర్, గుర్రాల భారతి, సిరిసిల్ల ఎస్సై అల్లం రమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

స్వరాభిషేకం విజయవంతం చేయాలి

బుగ్గారం: స్వరాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీసాంబశివనాగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి రాజిరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు నక్క రాజు ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 19 వరకు ఆలయంలో నిర్వహించే 24గంటల ఆధ్యాత్మిక స్వరాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు కటుకూరి అంజయ్య, వైస్ ఎంపీపీ సుచేందర్, ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చంద్రమౌళి, ప్రశాంత్, గంగారెడ్డి, రాగన్న, లక్ష్మణ్, పూర్ణచందర్, రమేశ్ పాల్గొన్నారు.

జ్యోతి హైస్కూల్‌లో ఫుడ్ కార్నివాల్



విద్యార్థులు తెచ్చిన రకరకాల వంటలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో ఫుడ్ కార్నివాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అరిసెలు, పల్లిపట్టీలు, సువ్వుండలు తీసుకువచ్చి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు పోషక విలువలు గల ఆహారంపై అధ్యాపకులు వివరించారు. డైరెక్టర్లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, అజిత్‌రావు పాల్గొన్నారు.